# సింగిల్ పేజీ కథలు

## గెలుపుబాట

**పెళ్ళి హాలు సందడిగా వుంది. భాజాభజంత్రీలతో, పిల్లల కేరింతలతో, ముత్తయిదువుల పెత్తనాలతో, పురుష పుంగవుల కాలక్షేపపు కబుర్లతో... ఆనందం తాండవిస్తోంది.**

పెళ్ళిపీటల మీద కూర్చున్న మనోహర్, మాలతిలను చూస్తుంటే నా హృదయం ఉప్పొంగిపోతోంది.

మనోహర్..నా రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ..నిన్నమొన్నటిదాకా నా చేతుల్లో ఆడుకున్నట్టనిపిస్తున్నా, అతడిప్పుడు పాతికేళ్ళ యువకుడు. మీసం మొలిచిన మగాడు.

తొందరగా ఎదిగిపోయాడని సాధారణంగా పెళ్ళీడుకొచ్చిన అమ్మాయిల గురించి అంటుంటారు. నాకెందుకో ఆ మాట అబ్బాయిలకి కూడా వర్తిస్తుందనిపిస్తుంది. అది ఏ బిడ్డయినా, తల్లిదండ్రుల మమకారం ఒక్కటే గదా!

మాలతి మరికొద్దిక్షణాల్లో మా కోడలు. కాదు కాదు..మాకు మరో కూతురు కూడా..ఆమె రాబోతున్నది మా మనోహర్ జీవితంలోకి మాత్రమే కాదు, తద్వారా మా భవితను నిర్దేశించే ఓ ముఖ్యమైన స్థానంలోకి కూడా. ఎందుకంటే..నాకు, నా సహధర్మచారిణి సుశీలకి పిల్లల తోడిదే లోకం. వారే మా ప్రాణం. నడుస్తున్న కాలంలో కోడళ్ళ దృష్టిలో అత్తమామల ప్రాణాలకు ఎంత విలువుందో జగద్విదితమే.

ఒక పెళ్ళి రెండు జీవితాల్ని కలిపేది. అప్పటికే పెనవేసుకున్న కొన్ని అనుబంధాల్ని త్రెంచేది కాకూడదు. మాలతి మా ఆశలని వమ్ము చేయదనే మా నమ్మకం. ఎందుకంటే..ఆమె మనోహర్ సెలక్షన్.

నా పెదవులపై చిన్న చిరునవ్వు కదిలింది. మనసు దాదాపు ఆరు నెలల వెనక్కి పరిగెత్తింది.

ఆ రోజు మొదటిసారిగా మనోహర్ దగ్గర తన పెళ్ళి ప్రస్తావన తెచ్చినరోజు...కంప్యూటర్ ఇంజనీరుగా ఓ మంచి కంపెనీలో ఉన్నతమైన ఉద్యోగంలో వున్న తనకి పిల్లనివ్వడానికి రకరకాలైన ఆఫర్లతో వస్తున్న వారి వివరాలను ముందుంచిన రోజు..

"అప్పుడే పెళ్ళేమిటి నాన్నా" అని అతడు సిగ్గు నటించలేదు. అన్ని విషయాలు క్షుణ్ణంగా విన్నాడు. అప్పుడు వివరించాడు తన మనసులో మాటని చాలా స్పష్టంగా.

వింటున్న సుశీలకి నోట మాట రాలేదు. కొద్దిసేపు స్థాణువే అయింది.

మనసు ఉరకలేసింది మాత్రం నాకే..అతడు చెప్పిన మాటల్లో సత్యాన్ని అర్థం చేసుకునే కొద్దీ నాలో విజయ గర్వం.



సుశీల అభ్యంతరాలు, మా తండ్రీ కొడుకుల ఐక్యత ముందు వీగిపోయాయి.

ఫలితం..మనోహరే తన భార్యను తనే ఎంపిక చేసుకున్నాడు. నేను చెప్పిన కొన్ని సంబంధాలలోంచే..అతడు తండ్రిమాట జవదాటని శ్రీరామచంద్రుడు కావాలని కోరుకోలేదు. తండ్రి మనసు తెలుసుకున్న వాడయితే చాలనుకున్నాను. నా నమ్మకాన్ని వమ్ము చేయలేదు మనోహర్.

మంగళసూత్రధారణ పూర్తయింది. వధూవరులు పెద్దలకి ప్రణమిల్లుతున్నారు.

సడన్‌గా నా చేతులపై రెండు వెచ్చటి కన్నీటి బొట్లు..తేరుకుని చూసేసరికి అక్కడ రాజారావు గారు..మాలతి తండ్రిగారు..నా చేతులని తన కళ్ళకద్దుకుంటూ ఉద్వేగంగా.

"మీరు దేవుడు బావగారు. మీ అబ్బాయి మా వేలుపు. అతడి సంస్కారానికి, ఉన్నత వ్యక్తిత్వానికి తల వంచి నమస్కరించడం తప్ప, వేరే విధంగా సత్కరించలేని పేదవాణ్ణి. కట్నాల సంతలో అమ్మకానికి పెట్టే తల్లిదండ్రులకన్నా ముందు తామే అమ్ముడు పోవడానికి సిద్ధపడుతున్న ఈ రోజుల్లో, అమ్మాయి గుణగణాలతో సంబంధం లేకుండా, పెళ్ళిచూపుల్లో మొదటిసారి మాట్లాడుతున్న మొహమాటమన్నా లేకుండా, ఆకలిగొన్న పులుల్లా అమ్మాయి శరీరాన్ని చూపులతో గుచ్చి గుచ్చి చూడడం, ముఖం మీదే ఆమెలో లేని లోపాల్ని చూపి ఆత్మన్యూనతకి గురి చేయడం, తద్వారా కట్నం డిమాండ్ పెంచడం జరుగుతున్న ఈ కాలంలో, మనోహర్ చేసిన పని ఎంతో గొప్పదంటాను" రాజారావు బావగారు ఇంకా పొగడ్తలతో ముంచెత్తుతూనే వున్నారు.

మొదటిసారి మనోహర్ తన అభిప్రాయం వెలుబుచ్చిన ఆ సంఘటన మళ్ళీ గుర్తుకొచ్చింది నాకు..

సూక్ష్మంగా చెప్పాలంటే..

"ఈ పెళ్ళిచూపుల వ్యవస్థపై నాకు నమ్మకం లేదు నాన్నా..కొన్ని దశాబ్దాల పాటు కలిసి ఒక్కటిగా జీవితాన్ని గడపవలసిన వ్యక్తులు అరగంట బలవంతపు పరిచయాలతో ఒకరికొకరు అర్థం అయిపోతారనుకోవడం ఆత్మవంచన. మసిపూసి మారేడుకాయ చేసే ఈ పద్ధతికి అర్థంలేదు. ఒక వ్యక్తి అరడజను సంబంధాలు చూశాడనుకుందాం. అతడు చేసుకోబోయేది ఒకరినే కాబట్టి, మిగతా ఐదుగురిని ఏదో కారణం చెప్పి కాదనాలి. ఆ కారణం ఎంతో నిజాయితీతో కూడి వున్నా, మనం అనుకుంటున్న ఆ లోపాన్ని వారికి ఎత్తి చూపే

హక్కు మనకు లేదు. ఎందుకంటే, అవతలివారి పరిస్థితుల్లో అది లోపం కాకపోవచ్చు. జీవితమంటే కలలుగనే ఏ స్త్రీ ఆత్మవిశ్వాసం మీద దెబ్బకొట్టే అర్హత ఏ మగాడు తీసుకోకూడదు. అందుకే నేను ఏ పెళ్ళిచూపులకి వెళ్ళను నాన్నా..అలాగని అమ్మాయిని చూడకుండా పెళ్ళి చేసుకోను. అందుకని... మీరు చెప్పే ప్రతి అమ్మాయిని, ఆమె నడవడికనూ, కుటుంబ పరిస్థితుల్ని, గమనిస్తాను. నాతో ఆమె ఇమడగలదా అని బేరీజు వేసుకుంటాను. అలాంటి ఒక అమ్మాయి కోసం ఎంతకాలమైనా ఆగుతాను. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది లేదు నాన్నా...తలొంచుకుని కూర్చునే పెళ్ళి చూపులకన్నా తనకి తెలియకుండా జరిగే పెళ్ళిచూపులు నయం కదా..ఒక అమ్మాయి ఓకే అనుకుంటే, మీ అంగీకారంతో ఆమె తల్లిదండ్రుల్ని కలిసి, నా గురించి మీ గురించి పూర్తిగా చెప్పి, వీలైతే నా పద్ధతిలోనే వాళ్ళమ్మాయిని నన్ను గమనించేలా ప్రోత్సహించమని చెబుతాను. ఆమెకు నచ్చితేనే పెళ్ళి.."

మనోహర్ మాటలు అక్షర సత్యాలు. సంతలో పశుప్రదర్శనలాంటి ఈ పెళ్ళిచూపుల వ్యవస్థ మారాలంటే, మనోహర్‌లాంటి ఆదర్శవంతులు ముందుకు రావాలి. వారికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కావాలి.

ఒక పేరున్న రచయితగా ఒకనాడు ఎన్నో ఆదర్శాలు వల్లించాను. నిజజీవితంలో ఎన్నింటితోనో రాజీపడి బ్రతుకుతున్నాను. ఈనాడు నా బిడ్డ ఆచరించి చూపిస్తున్నాడు. అతడికి చేయూతనివ్వడం ద్వారా ఒకనాటి నా ఓటమిలోంచి బయటపడి, గెలుపువైపు పయనిస్తున్నాను.

**-సి.వి.నరసింహదాసు (కోల్‌కతా)**

# స్థాయి

అది చాలా ఇరుకైన వీధిలా కన్పించింది. ఈమధ్యనే కొన్న కొత్త కారుకి ఎక్కడ గీతలు పడతాయేమోన్న భయంతో ఇంజన్ ఆఫ్ చేసి కార్లోంచి దిగాను. జేబులో ఉన్న అడ్రస్ పేపరు తీసి, మడత విప్పి మరోసారి చూశాను. వీధి పేరైతే కరెక్టుగానే ఉంది. లోపల ఏమైనా సందులున్నాయేమోననుకుని, కారు లాక్ చేసి, కొంచెం ముందుకెళ్ళి, బంకు దగ్గర విచారించాను.

"బాబూ! ఈ వీధిలో వేణుగోపాలావని..."

నా మాట పూర్తికాకముందే బంకులో ఉన్నతను కొంచెం ముందుకు వంగి "అదుగో! ఆయనే వస్తున్నారండి" అన్నాడు.

అవును...అతను వేణుగోపాలే...కానీ.. ఆ లోపలే వేణుగోపాల్ నన్ను చూసి ఆశ్చర్యపోతూ గబగబా నా దగ్గరకొచ్చి, నన్ను గట్టిగా కౌగలించుకున్నంత పని చేశాడు.

"నా కళ్ళింకా నమ్మడం లేదు. కలా? నిజమా? ఎన్నాళ్ళయ్యిందిరా నిన్ను చూసి రమేష్! రా మా ఇంటికెళ్దాం" మరోమాటకు తావివ్వకుండా నా భుజం మీద చెయ్యేసి నడక ప్రారంభించాడు వేణుగోపాల్.

ముందు చిన్న సిటౌట్. మధ్యగది...దాని తర్వాత చిన్న కిచెన్. మూడూ వరుసగా ఉన్నాయి. మసిపట్టి ఉన్న ఓ ప్లాస్టిక్ కుర్చీ వేసి నన్ను కూచోబెట్టాడు.

పోర్టబుల్ బ్లాకండ్ వైట్ టి.వి.లో క్రికెట్ మాచ్ ఆసక్తిగా చూస్తున్న కుర్రాణ్ణి...నాకు తన రెండో కొడుకుగా పరిచయం చేశాడు వేణుగోపాల్. నాకో నమస్కారం పెట్టి..మళ్ళీ మేచ్‌లో మునిగిపోయాడా పిల్లాడు.

వేణుగోపాల్ భార్యని పిలిచి పరిచయం చేశాడు. ఆమె బక్కపల్చగా రక్తహీనతతో ఉన్న పేషెంట్లా ఉంది. వేణుగోపాల్ లోపలున్న పెద్దకూతుర్ని పిలిచాడు. ఆమె చంకలో రెండేళ్ళ పిల్లాడున్నాడు. అల్లుడు ప్రైవేటు కంపెనీలో పన్జేస్తున్నట్టూ చెప్పాడు.

నేను తీసుకెళ్ళిన స్వీట్ పాకెట్ వాళ్ళకిస్తుంటే..వాళ్ళ మొహాల్లో ఏదో కుతూహలం, ఆశ్చర్యం.

వేణుగోపాల్ భార్య ప్లేటులో రెండు లడ్డూ, కాస్తంత మిక్చరూ తెచ్చి నా ముందుంచుతూ...

"ఇవ్వాళ మా మనవడి బర్త్‌డే...తీసుకోండి" అంది.

"అలాగా!" అని వేణుగోపాల్ మనవడికి "హేపీబర్త్‌డే" చెప్పి, వాడి చేతిలో వందరూపాయల నోటుంచాను.

"ఏమిటిదంతా రమేష్! డబ్బులెందుకు?" నొచ్చుకున్నాడు వేణుగోపాల్.

"ఫరవాలేదులే వేణూ! నేనివ్వగూడదా!"

వేణుగోపాల్ ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలో క్లర్కుగా చేస్తున్నాట్ట. నేను బాంకులో ఆఫీసరుగా ఇటీవలే ప్రమోషన్ అందుకున్న సంగతి చెప్పేసరికి వేణుగోపాల్ ఆనందపడిపోతూ అలనాటి మా కాలేజీ రోజుల్ని గుర్తుచేస్తుంటే..ఓ గంట కాలక్షేపం అయింది. వాచ్ వంక చూసు



కుని, లేస్తూ- "వెళ్ళొస్తానురా!" అన్నాను.

"భోంచేసి వెళ్ళొచ్చు గదరా" అన్నాడు వేణుగోపాల్.

"ఫరవాలేదు. నేను ఓ మీటింగ్‌కెళ్ళాలి. మళ్ళీ కలుద్దాం" అన్చెప్పి, బయల్దేరుతుంటే..నాతో కారు వరకూ వచ్చిన వేణు...

"రమేష్! మన బ్యాచ్‌లో ఇంకో వేణుగోపాల్ ఉండేవాడు. గుర్తుందా! అదేరా! స్పోర్ట్స్ బాగా ఆడేవాడు. వాణ్ణి మనమంతా 'స్పోర్ట్స్ వేణుగోపాల్' అని పిల్చేవాళ్ళం.."

"ఆ..అవునవును" అన్నాను గుర్తు తెచ్చుకుంటున్నట్టు మొహం పెట్టి.

"అతనూ ఇక్కడే రెండు వీధులవతల మూడో వీధిలో ఉంటున్నాడు. కారు, పెద్ద బంగళా, గ్రానైట్ బిజినెస్సట. రెండు ఫ్యాక్టరీలు ఉన్నాయట. ఎన్నోసార్లు బజార్లో కన్పిస్తూనే ఉంటాడు. ఏనాడూ పలకరించలేదు. నేనే ఓ రోజు మాట్లాడి, నేనీ వీధిలో ఉంటున్నట్టు చెప్పాను..'అలాగా' అన్నాడంతే. అదే నువ్వు చూడు...ఈ పాత స్నేహితుణ్ణి మర్చిపోకుండా నన్ను చూడాలని వెతుక్కుంటూ వచ్చినందుకు థ్యాంక్స్‌రా! రమేష్" అన్నాడు వేణుగోపాల్ చెమర్చిన కళ్ళతో నా చేతులు పుచ్చుకుంటూ.

కారు స్టార్టు చెయ్యబోతూ, నాలుక చివరి వరకూ వచ్చిన మాట నోరు జారకముందే..మాట మార్చి-

"ఇందులో ఏముందిలేరా! వేణూ..టైమైంది..మళ్ళీ కలుస్తాను" అని కారు ముందుకు పోనిస్తూ..

నిజానికి నేను వెతుక్కుంటూ వచ్చింది మూడో వీధిలో ఉన్న స్పోర్ట్స్ వేణుగోపాలాన్ని కలవడానికే. అడ్రస్ సరిగ్గా కనుక్కోలేక, ఈ వీధికొచ్చి అనుకోకుండా అప్పటి క్లాస్‌మేటైన ఈ వేణుగోపాలాన్ని కలవటం జరిగిందని అతనికి చెప్పకపోవటం మంచిదైందని, కారుని విశాలంగా ఉన్న మూడో వీధిలోకి తిప్పి, స్పోర్ట్స్ వేణుగోపాలింటి ముందు ఆపాను..మా బ్యాంకు డిపాజిట్ల విషయమై అతన్ని కలిసేందుకు..వచ్చిన నేను.

**-ఎం.వెంకటేశ్వరరావు (సికిందరాబాద్)**